క్లుప్తంగా

నేడు వేట్లపాలెం భేతాళ సంబరం

సామర్లకోట: వేట్లపాలెం గ్రామంలోని భేతాళ స్వామి ఆలయంలో బుధవారం జరిగే సంబరానికి పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. వేట్లపాలెంలోని భేతాళస్వామి ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. దసరా ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఈ నెల 15 నుంచి 25 వరకూ భేతాళస్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. నిత్యం ఆలయంలో పూజలు జరుగుతున్నాయి. బుధవారం జాతరతో ఉత్సవాలు ముగుస్తాయి. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా ఏర్పాటు చేశారు. అలాగే భేతాళస్వామిని బారీఎత్తున ఊరేగింపుగా గ్రామ శివారు తీసుకువెళ్లి, తిరిగి సమాధి చేస్తారు. ఉత్సవ కమిటీ నాయకులు కొండపల్లి సూరన్నచౌదరి, కొండపల్లి జగ్గారావు, గోలి వెంకట్రావు, నున్నా వెంకట్రాజు తదితరులు ముగింపు ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

రేపు గుడివాడలో అయ్యప్ప పడిపూజ

పెద్దాపురం: ఏటా మండలంలోని గుడివాడ గ్రామంలో నిర్వహించే అయ్యప్ప పడిపూజ ఈ నెల 26న నిర్వహించనున్నట్టు గురుస్వామి, సర్పంచ్ కనపర్తి సీమదొర తెలిపారు. మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ, రాత్రి 7 గంటలకు అయ్యప్ప స్వామి లక్షబిల్వార్చన, పడిపూజ జరుగుతాయన్నారు. రేగడ మిల్లి రామ్‌దేవ్ శర్మ (రాంబాబు స్వామి) ఆధ్వర్యంలో గురుస్వామి పెచ్చెటి నూకరాజు పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. మధ్యాహ్నం మేళతాళాలతో పేటతుల్లి కార్యక్రమం ఉంటుందన్నారు. సుమారు లక్ష మందికి పైగా స్వాములు పూజల్లో పాల్గొంటారని సీమదొర స్వామి తెలిపారు.

మాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం

సామర్లకోట: గోదావరి కాలువ తీరంలో వేంచేసి ఉన్న అతిపురాతన విష్ణు ఆలయమైన శ్రీమాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో సాగింది. శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని స్వామివారి గ్రామ సేవ నిర్వహించారు. ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా.. ఫ్లైఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, చిన్నవీధి, పెద్ద వీధి, యార్లగడ్డవారి వీధి, నీలమ్మ చెరువు, మఠం సెంటర్, కొత్తూరు మీదుగా తిరిగి గ్రామోత్సవం ఆలయానికి చేరింది. స్వామి వారు తమ ఇళ్ల వద్దకు రావడంతో, భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వాకతిప్పలో అన్నసమారాధన

కొత్తపల్లి: దేవీ నవరాత్రుల సందర్భంగా వాకతిప్ప సతీష్‌చంద్ర కాలనీలోని బాల దుర్గా గురు పీఠంలో గురుస్వామి పథం త్రిమూర్తులు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. సోమవారం భారీ అన్నసమారాధన చేశారు. సుమారు 3 వేలు మంది భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే ఉప్పాడలోని ఐశ్వర్య సాయి మందిరం వద్ద మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

దుర్గా మాత గ్రామోత్సవం

పిఠాపురం: గ్రామంలో నౌ దుర్గా యువ గర్బ మండలి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన దుర్గా మాత గ్రామోత్సవం సాంప్రదాయం ఉట్టి పడింది. దాండియా నృత్యాలు, భజనలతో అమ్మవారి విగ్రహాన్ని సాంప్రదాయబద్ధంగా పట్టణంలో ఊరేగించారు. గత తొమ్మిది సంవత్సరాలుగా నవరాత్ర ఉత్సవాలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న నౌ దుర్గా యువ గర్బ మండలి సభ్యులను పలువురు అభినందించారు. ఈకార్యక్రమంలో నౌ దుర్గా యువ గర్బ మండలి సభ్యులు ఓబ్ సింగ్, పులా రామ్, ప్రకాష్ మాలీ, నరింగరామ్ దివాసీ, యోగేష్ జీ, బాబు లాల్, బజరంగదళ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జైగణేష్ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ముమ్మిడి శ్రీను నరేష్ కుమార్, సోపారామ్ దివాసీ, సురేంద్ర దత్త పాల్గొన్నారు.

పీబీ దేవంలో విజయ దశమి పూజలు

సామర్లకోట: శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని పీబీ దేవం గ్రామంలో మంగళవారం సాయంత్రం విజయ దశమి పూజలు చేశారు. సేవా సమితి ఆధ్వర్యంలో గత 64 ఏళ్లుగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సాయంత్రం వందలాది మహిళలతో లలితా సహస్ర పారాయణ నిర్వహించారు. బుధవారం పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి. సేవా సమితి నాయకులు తోటకూర గంగాధర్, వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ, విశ్వనాథ్, టీవీవీ సత్యనారాయణ, నువ్వుల బాబ్జీ భక్తులకు సేవలందించారు.

బస్ స్టేషన్‌లో వృద్ధురాలు

సామర్లకోట: భారంగా భావించిన కుటుంబ సభ్యులు ఓ వృద్ధురాలిని సామర్లకోట బస్సు కాంప్లెక్స్‌లో వదిలిపోయిన సంఘటన ఇది. మంగళవారం మధ్యాహ్నం 3 సమయంలో ఆమెను విడిచిపెట్టిన వారు రాత్రి వరకూ రాకపోవడంతో.. అక్కడి ప్రయాణికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ట్రాఫిక్ ఏఎస్సై రత్నం అక్కడకు చేరుకుని వృద్ధురాలిని ఆరాతీశారు. కాకినాడ అని మినహా ఆమె ఏమి చెప్పలేకపోవడంతో, దిశ పోలీసు స్టేషన్‌కు సమాచారమిచ్చి, ఆమెను ఆటోలో కాకినాడ దిశ పోలీసు స్టేషన్‌కు పంపించారు.

నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం

సామర్లకోట: దసరా సెలవులు ముగియడంతో బుధవారం నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతున్నట్టు మండల విద్యా శాఖాధికారి వై శివరామకృష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుంచి 24 వరకు పాఠశాలలకు సెలవులు ఇచ్చినట్టు చెప్పారు.


పాదగయ క్షేత్రంలో విజయదుర్గాదేవిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరీదేవి


రాజరాజేశ్వరీదేవిగా తాటిపర్తి అపర్ణాదేవి


కుతుకుడుమిల్లిలోని కనకదుర్గమ్మ అమ్మవారు


రాజరాజేశ్వరీదేవి అవతారంలో భువనేశ్వరి అమ్మవారు


రాజరాజేశ్వరీ దేవిగా కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు


కొమరగిరిలో రాజరాజేశ్వరీదేవి అవతారంలో బాల కనకదుర్గమ్మ

అంబరాన్నంటిన అమ్మ సంబరం

- గ్రామగ్రామాన దసరా ఉత్సవాలు
- వివిధ రూపాల్లో పూజలందుకున్న అమ్మవార్లు

పిఠాపురం: దసరా సంబరాలు అంబరాన్నంటాయి. గత నెల 15వ తేదీ నుంచి ప్రారంభమైన శరన్నవ రాత్ర ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. విజయదశమి సందర్భంగా సోమ, మంగళవారాల్లో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రంలో దసరా ఉత్సవాల్లో భాగంగా రాజరాజేశ్వరీదేవి విజయదుర్గాదేవిగా భక్తులకు దర్శనమివ్వడంతో వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పురుహూతికాదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. తొలుత స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలను ఎమ్మెల్యే పెండెం దొరబాబు పూజలు ప్రారంభించారు. పాదగయ పుష్కరిణిలో అమ్మవారి తెప్పోత్సవం కనుల పండువగా నిర్వహించిన ఆలయ అర్చకులు శమిపూజ నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గంలో కొత్తపల్లి గొల్లప్రోలు, పిఠాపురం మండలాల పరిధిలో కనకదుర్గ అమ్మవారి ఆలయాలలో దశమి సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా భక్తులు రాజరాజేశ్వరిదేవి. పురుహూతికా అమ్మవారు, దత్తాత్రేయస్వామిలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. దసరా ఉత్సవాలు ముగియడంతో బుధవారం అన్ని గ్రామాల్లోను అమ్మవారి ఊరేగింపులకు ఏర్పాట్లు చేశారు.

పెద్దాపురం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని దుర్గమ్మ అమ్మవారి సంబరాలు అంబరాన్ని తాకాయి. అత్యంత భక్తిశ్రద్ధలతో గ్రామగ్రామాన అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ ఊరేగింపులు జరిపారు. పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో అమ్మవార్ల సంబరాలను వైభవంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు, శమిపూజలు, పూర్ణ హారతి నిర్వహించి, అమ్మవార్లను మొక్కుకున్నారు.

భువనేశ్వరి పీఠంలో శమిపూజ, పూర్ణాహుతి

శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా స్థానిక వర్ణుల వారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి, చాడా హన్‌మాన్ శాస్త్రి ఆధ్వర్యంలో శమి పూజ, పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. భువనేశ్వరి అమ్మవారు దశమి పర్వదినాన రాజరాజేశ్వరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు దంపతులు కలశస్థాపన, పుష్పాలంకరణ సేవాభాగ్యం నిర్వహించగా, విశేషార్చన, అలంకరణతో పాటు పూర్ణాహుతి, సాయంత్రం జమ్మిచెట్టుకు పూజను నిర్వహించారు.


పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

మరిడమ్మ ఆలయంలో..

కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో వేద పండితులు అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేశారు. పంచామృతాభిషేకం, కుంకుమార్చన, శమిపూజ, పూర్ణాహుతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కాండ్రకోట నూకాలమ్మ ఆలయంలో..

మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో విజయ దశమి పర్వదినాన అమ్మవారు రాజరాజేశ్వరీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ, ఆలయ చైర్మన్ గవరసాని వీరాస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, కళ దంపతులు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, పార్టీ మండల యూత్ అధ్యక్షులు గోపు మురళి, కనపర్తి చీమదొర, జోకా నానాజీ, గంటా రామస్వామి. నల్లల గోవిందు, లక్కాకుల నానాజీ, గవరసాని రాజశేఖర్ పాల్గొన్నారు.


పాదగయ క్షేత్రంలోని పాదగయ పుష్కరిణిలో అమ్మవారి తెప్పోత్సవం

రాజరాజేశ్వరీ, అర్ధనారేశ్వరీ దేవి నమస్తుభ్యం

కొత్తపల్లి: మండలంలోని దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానికంగా ఉన్న ధర్మశాస్తా ఆలయంలోని కనకదుర్గ అమ్మవారికి ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు. కొమరగిలో శ్రీ బాల కనకదుర్గాదేవి రాజరాజేశ్వరీ, అర్ధనారేశ్వరీశ్వరి దేవిగా దర్శనమిచ్చారు.


భువనేశ్వరి పీఠంలో నిర్వహిస్తున్న పూర్ణాహుతి


కొత్తపల్లిలో బాల కనకదుర్గాదేవి ఆలయం వద్ద కుంకుమ పూజ చేస్తున్న భక్తులు

నేత్ర పర్వం.. అమ్మవారి దర్శనం


సామర్లకోట పంచారామ క్షేత్రంలో జమ్మి చెట్టు వద్ద శమిపూజ

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన శ్రీబాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం ఆలయంలో బిక్కిన సాయి కుటుంబ సభ్యులు చండీ హోమ చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఉన్న జమ్మి చెట్టు వద్ద శమి పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం జరిగింది. తొమ్మిదో రోజు శ్రీబాలాత్రిపుర సుందరీదేవిని రాజరాజేశ్వరీగా అలంకరణ చేశారు. సాయంత్రం అమ్మవారికి వెండి చీరతో అలంకరించారు. శమీ పూజ, అమ్మవారి అలంకరణలు, గ్రామోత్సవాలను తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పూలు, విద్యుద్దీపాలతో అలంకరించిన సింహ వాహనంపై స్వామివారి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి, గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి పట్టణ వీధుల మీదుగా గ్రామోత్సవం కొనసాగింది. ఆయా కార్యక్రమాల్లో ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, నాతి పాముల సూరిబాబు, చల్లా కుమారి, బొందలపు కృష్ణవేణి, భక్తసంఘ నాయకులు బిక్కిన సాయి, బొందలపు వెంకటరమణ, అడబాల కుమార స్వామి, నోరి కృష్ణారావు మాస్టారు తదితరులు పాల్గొన్నారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు విజయ్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.


సామర్లకోట నవదుర్గ ఆలయంలో అమ్మవారి పూజలో పాల్గొన్న దొరబాబు


బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి గ్రామోత్సవం

నవదుర్గ ఆలయంలో దొరబాబు పూజలు

బడేలమ్మ చెరువు వద్ద వేంచేసి ఉన్న నవదుర్గ ఆలయంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయ దశమిని పురస్కరించుకుని ఆలయంలో జమ్మి చెట్టు వద్ద శమిపూజ చేశారు. ఆలయ వ్యవస్థాపకురాలు కనకవిజయలక్ష్మి ఆలయ విశిష్టతను వివరించారు. అమ్మవారికి పూజలు చేసి, నవదుర్గల వేషధారణలు వేసిన చిన్నారులను దొరబాబు అభినందించారు. పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, గోపు మురళి తదితరులు పాల్గొన్నారు.

కార్తిక ఉత్సవాలకు రాట ముహూర్తం

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో కార్తిక మాసం సందర్భంగా నెల రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు సంబంధించి మంగళవారం ముహూర్తపు రాట వేశారు. దీపావళి మరుసటి రోజు నుంచి కార్తిక మాసం ప్రారంభం కానుంది. ఈఓ డి.నాగ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కాలభైరవస్వామి ఆలయం వద్ద క్యూ లైన్లు, పందిళ్లకు సంబంధించి రాట ముహూర్తపు పూజ చేశారు. అనంతరం కాల భైరవస్వామి ఆలయం, ఉప ఆలయమైన సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయం వద్ద రాటలు వేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, బొందలపు కృష్ణవేణి, చల్లా కుమారి, భక్త సంఘ నాయకులు బీవీ రమణ, చల్లా సత్తిబాబు పాల్గొన్నారు. ఆలయ అభిషేక పండితుడు వేమూరి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూజలు చేశారు. నవంబరు 13 నుంచి నెల రోజుల పాటు ఆలయంలో కార్తిక మాస ఉత్సవాలు జరుగుతాయి. ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపంతో ప్రతి రోజూ ఆలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తారు. ఆలయంలో నిత్యం జ్యోతిర్లింగార్చన జరుగుతుంది. ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి ట్రస్టు బోర్డు, భక్తులతో సమావేశం నిర్వహిస్తామని ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. కార్తిక మాస ఉత్సవాల్లో పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారి గ్రామోత్సవం, రాత్రి జ్వాలాతోరణం ఉంటుంది. స్వామివారి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ కోనేరులో తెప్పోత్సవం జరుగుతుంది. అమావాస్యను పురస్కరించుకుని కోటి దీపాలంకరణ, పోలి పాడ్యమి సందర్భంగా స్వామివారి జటాజూటం అలంకరణతో ఉత్సవాలు ముగుస్తాయి.


ముహూర్తపు రాట వేసిన ఈఓ, ట్రస్టు బోర్డు సభ్యులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మంగళవారం రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ డ్రైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. స్థానిక సత్తెమ్మతల్లి ఆలయం వద్ద నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన అమ్మవారికి పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.


చేబ్రోలులో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

మద్యం మత్తులో కత్తితో దాడి

సామర్లకోట: తాగిన మైకంలో కత్తితో దాడి చేసిన సంఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన మార్ని శ్రీను, అదే గ్రామానికి చెందిన పుప్పాల రాంబాబు కలిసి మద్యం సేవించారు. మాటామాటా పెరగడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో రాంబాబు కత్తితో శ్రీనుపై దాడి చేశాడు. ఈ సంఘటనలో శ్రీను చేతివేళ్లు రెండు తెగిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు వీరిని చెదరగొట్టారు. గాయపడిన శ్రీనును స్థానికులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు అక్కడి నుంచి స్థానిక పోలీసులకు సమాచారం అందింది. ఇరువర్గాల నుంచి తమకు ఫిర్యాదులు అందలేదని, ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేస్తామని సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపు

కొత్తపల్లి: దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా కొండెవరంలో ఉన్న కనకదుర్గాదేవి అమ్మవార్ని మంగళవారం ఘనంగా ఊరేగించారు. అమ్మవారి ఉత్సవలను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా అమ్మవారిని గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు.


కొండెవరంలో అమ్మవారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

అత్యవసరమైతే.. చాటుకు వెళ్లాల్సిందే..!

- ప్రభుత్వ కార్యాలయాల వద్ద కానరాని మరుగుదొడ్లు
- పట్టించుకోని అధికారులు

పెద్దాపురం: ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాలని.. ఆరుబయట మల విసర్జన వల్ల వ్యాధులు ప్రబలుతాయంటూ అధికారులు మారుమూల గ్రామాల్లో సైతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మిస్తున్నారు. వారి కార్యాలయాలకు మాత్రం వివిధ అవసరాలకు వచ్చే వారి కోసం మాత్రం పట్టించుకోవడం లేదు. పెద్దాపురం మండల కేంద్రానికి నిత్యం పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి జనం భారీగా వస్తుంటారు. ఆయా ప్రాంతాలకు మండల కేంద్రం కొన్ని కి.మీ.ల దూరంలో ఉంది. భూ సమస్యలు, రుణాలు, భూముల క్రయవిక్రయాలు, సబ్‌ట్రెజరీ పనులు ఇలా అనేక సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. డ్వాక్రా మహిళలు, కక్షిదారుల సంఖ్య అధికంగా ఉంటుంది. రోజూ సాయంత్రం వరకూ పనుల కోసం వేచిచూసే వారికి మాత్రం కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్ల సదుపాయం లేదు. దీంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్దే స్వచ్ఛ స్ఫూర్తి కానరాకపోవడం అధికారుల చిత్తశుద్ధికి అద్దం పడుతోంది. పెద్దాపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, ట్రెజరీ, సబ్ జైలు, గృహ నిర్మాణం, ఉపాధి హామీ పథకం, వైఎస్సార్ క్రాంతి పథం–మహిళా సమాఖ్య తదితర కార్యాలయాలన్నీ ఉన్నాయి. హౌసింగ్, ట్రెజరీ, తహసీల్దార్, వెలుగు, వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. మిగతా వాటిలో కనీసం ఒక్క మరుగుదొడ్డి కూడా లేదు.


పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కక్షిదారులు

గోడ చాటుకు పరుగెట్టాల్సిందే..

గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే మహిళల అవస్థలు వర్ణనాతీతం. మండల కేంద్రానికి వివిధ ప్రాంతాల నుంచి నిత్యం సుమారు 300 మంది ఇక్కడకు వస్తుంటారు. అత్యవసర సమయంలో మరుగుదొడ్డి అందుబాటులో లేకపోవడంతో కార్యాలయాల గోడల చాటుకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. నిబంధనల మేరకు మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సులభ్ కాంప్లెక్స్‌ల వంటివి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి..



ప్రతిరోజూ సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని అనేక గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతం నుంచి వివిధ అవసరాల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్నారు. కక్షిదారులు, విక్రయదారులకు మరుగుదొడ్లు లేక, మహిళలు సైతం పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి. – గుణ్ణం లక్ష్మణరావు, అధ్యక్షుడు, ఫర్ ద పీపుల్ ఫౌండేషన్, పెద్దాపురం